ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 29 జనవరి 2024





చోడవరం-దేవరాపల్లి రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

డి.పట్టా రైతులకు మొండి చెయ్యి

జగనన్న ఇళ్ల కాలనీలకు మూడేళ్ల క్రితం భూములు సమీకరణ

- పట్టాదారులకు ఎకరాకు 900, ఇతరులకు 450 గజాల అభివృద్ధి చేసిన స్థలాలు ఇస్తామని అధికారులు హామీ
- 320.83 ఎకరాలు ఇచ్చిన పైవాడఅగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడు పాలెం రైతులు
- రెండేళ్లపాటు స్థలాలు చూపని అధికారులు
- ఎట్టకేలకు ఇటీవల గెడ్డ పక్కన, శ్మశానవాటిక సమీపంలో స్థలాలు కేటాయింపు
- ముంపు ప్రాంతంలో ఇవ్వడంపై లబోదిబోమంటున్న రైతులు
- నాటి హామీలను అమలుచేయని అధికారులపై ఆగ్రహం
- న్యాయం చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక

సబ్బవరం, జనవరి 28:

'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం' కింద ఇళ్ల స్థలాల లేఅవుట్ల కోసం భూములు ఇచ్చిన రైతులకు వైసీపీ ప్రభుత్వం చుక్కలుచూపిస్తున్నది. జీవీఎంసీ పరిధిలోని పేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి మూడేళ్ల క్రితం భూములను సమీకరించిన రెవెన్యూ అధికారులు, ఇందుకు బదులుగా అభివృద్ధి చేసిన స్థలాలను ఇంతవరకు నిర్వాసిత రైతులకు అందజేయలేదు. మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులను కలిసి, తమ గోడు వెల్లబోసుకుంటున్నా స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి భూ నిర్వాసిత రైతులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



గత ఏడాది డిసెంబరులో తుఫాన్ వర్షాలకు గెడ్డ పోటెత్తడంతో రైతులకు కేటాయించిన స్థలాల్లో మేటలు వేసిన ఇసుక, మట్టి (ఫైల్ ఫొటో)

రాష్ట్రప్రభుత్వం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం' కింద మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంపీ) పరిధిలో నివాసం వుంటున్న పేదలకు సెంటు చొప్పు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సబ్బవరం మండలంలోని పైడివాడ, పైడివాడఅగ్రహారం, ఎరుకునాయుడుపాలెం, అసకపల్లి, గాలిభీమవరం, గొల్లలపాలెం, గంగవరం, నంగినారపాడు గ్రామాల్లో డి.పట్టా భూములతోపాటు ఎటువంటి పట్టా లేకుండా రైతులు సాగు చేసుకుంటున్న భూములను సమీకరించింది. పైవాడఅగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో 151 మంది రైతుల నుంచి 320.83 ఎకరాలను రెవెన్యూ అధికారులు సమీకరించారు. ఇందుకు పరిహారం డబ్బులు ఇవ్వకుండా, అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో స్థలాలు ఇస్తామని చెప్పారు. భూ సమీకరణ కోసం గ్రామసభ నిర్వహించి డి.పట్టా రైతుకు ఎకరాకు 900 గజాలు, ఎటువంటి పట్టా లేకుండా సాగులో వున్న రైతులకు ఎకరాకు 450 గజాల చొప్పున ఇస్తామన్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు 60/ 40 అడుగుల వెడల్పుతో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. పైవాడఅగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో డి.పట్టా రైతుల నుంచి సమీకరించిన 320.83 ఎకరాల్లో 233 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాల కింద కేటాయించి 10,228 మందికి ఒక్కొక్కరికి సెంటు చొప్పున లేఅవుట్‌గా అభివృద్ధి చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు ఇవ్వడానికి లేఅవుట్‌కు ఒక పక్కన 87.83 ఎకరాలు కేటాయించారు. తరువాత 2022, ఏప్రిల్ 28న మండలంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జీవీఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు సెంటు స్థలం చొప్పున పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాలకు భూములు



60 అడుగులకు విస్తరించని లంకెలపాలెం రోడ్డు నుంచి లేఅవుట్‌కు వెళ్లే సీసీ రోడ్డు



పైడివాడఅగ్రహారంలో డి.పట్టాదారులకు ప్రతిఫలంగా ఇవ్వడానికి అధికారులు కేటాయించిన గెడ్డ స్థలం

ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలుపుతూ, వీఎంఆర్‌డీఏ అధికారులు అభివృద్ధి చేసిన స్థలాలను ప్లాట్లుగా ఇస్తామని చెప్పారు. ఇది జరిగి సరిగ్గా 21 నెలలు అయ్యింది. కానీ భూములు ఇచ్చిన రైతులకు ఇంతవరకు అభివృద్ధి చేసిన స్థలాలను ... మిగతా 8వ పేజీలో

న్యాయం చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాం



మా కుటుంబానికి సర్వే నంబర్లు 126, 128ల్లో 5.9 ఎకరాల డి.పట్టా భూములు వున్నాయి. మూడేళ్ల క్రితం అప్పటి ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ రమాదేవి గ్రామ సభ నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాల కోసం మా గ్రామం పరిధిలో డి.పట్టాతోపాటు రైతుల సాగులో వున్న భూములను సమీకరించనున్నట్టు చెప్పారు. ఇందుకు ప్రతిఫలంగా 40 అడుగుల ఇంటర్నల్ రోడ్లు, లంకెలపాలెం రోడ్డు నుంచి లేఅవుట్ వరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించి, అభివృద్ధి చేసిన స్థలాలను ఇస్తామని చెప్పారు. దీంతో భూములు అప్పగించాం. మాకు స్థలాలు ఎక్కడ ఇచ్చేది చాలా కాలంపాటు చెప్పలేదు. చివరకు శ్మశానవాటిక సమీపంలో, వరద నీరు ప్రవహించే గెడ్డ పక్కన స్థలాలు చూపించారు. ఇటువంటి చోట ఇళ్ల స్థలాలను ఎవరు కొంటారు? మాకు న్యాయం చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాం.

- అక్కిరెడ్డి దుర్గినాయుడు, పైడివాడఅగ్రహారం

ట్రాఫిక్ పద్మవ్యూహం!

చోడవరంలో విస్తరణకు నోచుకోని రహదారులు

- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- చీడికాడ, లక్ష్మీపురం, దేవరాపల్లి వెళ్లే రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని పోలీసులు, పంచాయతీ అధికారులు



చోడవరం-చీడికాడ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

చోడవరం, జనవరి 28:

పట్టణంలో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోకపోవడం, రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనదారులతోపాటు ప్రజలు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

చోడవరం పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. నియోజక వర్గ కేంద్రం కావడం, వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలతో రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రత్యేకించి చోడవరం- చీడికాడ, చోడవరం- లక్ష్మీపురం, చోడవరం- దేవరాపల్లి మార్గాల్లో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ రహదారుల్లో సమస్య చాలా అధికంగా వుంది. దశాబ్దాల నుంచి రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడం ఒక సమస్య అయితే.. ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చి వ్యాపారాలు సాగిస్తుండడం మరో సమస్య. దీంతో కొనుగోలుదారులు తమ వాహనాలను దుకాణాల ముందు రోడ్డుపై పార్కింగ్ చేయాల్సి వస్తున్నది. అంతేకాక సరకుల అన్‌లోడింగ్ చేసే వాహనాలను సైతం రోడ్డుపైనే వుంచుతున్నారు. ఫలితంగా ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. వ్యాన్లు, కార్లు వంటి వాహనాలు ఎదురైతే తప్పుకోవడానికి వీలు కావడంలేదు.

చోడవరం- చీడికాడ రోడ్డులో మెయిన్ రోడ్డు నుంచి పూర్ణా థియేటర్ వరకు, చోడవరం-లక్ష్మీపురం రోడ్డులో మెయిన్ రోడ్డు నుంచి చలపతి స్కూల్ వరకు ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. లక్ష్మీపురం రోడ్డులో పాఠశాలలు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులను ఉదయం స్కూళ్లకు తీసుకురావడానికి, సాయంత్రం ... మిగతా 8వ పేజీలో

ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెబుతాం

వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుంటుంది

- ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్



'సాగర సంగ్రామ దీక్ష' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్, ఉపాధ్యాయులు

అనకాపల్లి రూరల్, జనవరి 28:

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తానని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిన సీఎం జగన్మోహన్‌రెడ్డికు గుణపాఠం చెబుతామని, రానున్న ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్ హెచ్చరించారు. విశాఖలో వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించనున్న 'సాగర సంగ్రామ దీక్ష'కు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఇక్కడ ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఓపీఎస్‌ను అమలు అమలవుతున్నదని, ఏపీలో అమలు చేయడానికి ప్రభుత్వానికి వున్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ అంశాన్ని తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, చిన్నారావు, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

విద్యుత్తు కొనుగోళ్లు, చార్జీల పెంపుపై విశాఖ వేదికగా విచారణ

- వర్చువల్ విధానంలో అభిప్రాయాలు తెలపనున్న 71 మంది
- నాలుగు రోజులపాటు కార్యక్రమం



ప్రజాభిప్రాయ సేకరణకు ఈపీడీసీఎల్ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత చార్జీల పెంపు, విద్యుత్ కొనుగోళ్లపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వర్చువల్ విధానంలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ మేరకు ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్‌సీ అధికారులతోపాటు ఏపీ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన ... మిగతా 8వ పేజీలో

వరి రైతు పాట్లు

ధాన్యం అమ్ముకోవడానికి నానాఇక్కట్లు

- సుదూరంలో వున్న వేరే మండలాల రైస్ మిల్లులను కేటాయిస్తున్న అధికారులు
- వాహనం సమకూర్చుకుని, ధాన్యాన్ని మిల్లుకు తరలించే బాధ్యత కూడా రైతుదే!
- వాస్తవ రవాణా చార్జీలతో పోలిస్తే ప్రభుత్వం ఇచ్చేది చాలా తక్కువ
- చేతి చమురు వదులుతున్నదని అన్నదాతలు ఆవేదన

నాతవరం, జనవరి 28:

ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు తరలింపు, రవాణా చార్జీల చెల్లింపు వంటి విషయాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్న మాటలు, క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తమ గ్రామాలకు దగ్గరలో వున్న రైస్ మిల్లుకు కాకుండా సుదూరంలో వున్న ఇతర మండలాల్లోని రైస్ మిల్లులకు ధాన్యం తరలించాలి రావడం చాలా ఇబ్బందిగా వుందని, పైగా ధాన్యం తీసుకెళ్లడానికి అధికారులు వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో అధిక రవాణా చార్జీలు చెల్లించి తామే వాహనాలను సమకూర్చుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అధికారులు చెప్పిన ప్రకారం ధాన్యం అమ్మిన 15 రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జమ కావడంలేదని చెబుతున్నారు.



పాయకరావుపేటలో ఓ రైస్ మిల్లుకు తరలించడానికి ట్రాక్టర్‌లోకి ఎక్కించిన ధాన్యం బస్తాలు

ప్రభుత్వానికి ధాన్యం అమ్ముకోవాలంటే అధికారులు చుక్కలు చూపిస్తున్నారని మండలంలోని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని తూకం వేసే దగ్గర నుంచి రైస్ మిల్లుకు తరలించే వరకు బాధ్యత మొత్తం తమపైనే మోపుతుతన్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం ఈ-క్రాప్‌లో పేర్లు నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తారు. ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలనుకునే రైతులు వరి కుప్పలను నూర్పే రోజున లేదా మరుసటి రోజున రైతు భరోసా కేంద్రంలో వుండే వ్యవసాయ సహాయకులకు (ఏఏవో) సమాచారం ఇవ్వాలి. ఏఏవో, పౌరసరఫరాల సిబ్బంది కలిసి రైతు కల్లం వద్దకు వెళ్లి ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షిస్తారు. నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం వుంటే ధాన్యం సేకరిస్తున్నట్టు రైతుకు చెబుతారు. గోనె సంచుల్లో ధాన్యం నింపిస్తారు. ఏ రైస్ మిల్లుకు ధాన్యం తరలించాలో ఆన్‌లైన్‌లో చూసి చెబుతున్నారు. అనంతరం జీపీఎస్‌లో వివరాలు నమోదైన వాహనాన్ని వే బ్రిడ్జికు పంపి కాటా పెట్టిస్తారు. అనంతరం కల్లం వద్దకు రప్పించి ధాన్యం ఎక్కించి మళ్లీ తుకం వేస్తారు. తరువాత రైతు వివరాలతో పాటు ఎంత ధాన్యం విక్రయించిందీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం ధాన్యాన్ని ఫ్యాక్టరీకి తరలిస్తారు. రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. కానీ మండలంలో ధాన్యం సేకరణ వరకు బాగానే వున్నప్పటికీ రవాణా విషయంలో మాత్రం అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వేరే మండలాల్లో వున్న రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించడానికి అవసరమైన వాహనాలను రైతులే సమకూర్చుకోవాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు రవాణా చార్జీలు బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని చెబుతున్నారు. కానీ వాస్తవ రవాణా చార్జీలకు, ప్రభుత్వం చెల్లించే రవాణా చార్జీలకు పొంతన వుండడంలేదని రైతులు వాపోతున్నారు. ఉదాహరణకు నాతవరం మండలం నుంచి పాయక రావుపేటలోని రైస్ మిల్లుకు ట్రాక్టర్‌లో (సుమారు ఆరు టన్నులు) ధాన్యం తరలించడానికి ట్రాక్టర్ యజమానులు రూ.4 వేలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం రూ.1,600 చెల్లిస్తున్నది. వాహనాలను అధికారులు సమకూర్చకపోవడంతో తామే ట్రాక్టర్లను మాట్లాడుకుని పాయకరావుపేట రైస్ మిల్లుకు ధాన్యం తరలిస్తున్నామని, దీనివల్ల తమకు చేతిచమురు వదులుతున్నదని రైతులు వాపోతున్నారు. నాతవరం మండలంలో నాలుగు రైస్ మిల్లులు వుండగా, అధికారులు 40 నుంచి 50 కిలోమీటర్ల ... మిగతా 8వ పేజీలో

హైడ్రో పవర్ ప్లాంట్ పనులపై గిరిజనులు ఆగ్రహం

రైవాడ జలాశయంతోపాటు పలు గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన

- మట్టి పరీక్షల పనులు నిలుపుదల
- యంత్రాలను ఇక్కడి నుంచి వెంటనే తీసుకెళ్లాలని సిబ్బందికి హుకుం

దేవరాపల్లి, జనవరి 28: మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బల్లిపురం నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి వరకు అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టడంపై గిరిజనులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు డి.వెంకన్నను వెంట బెట్టుకొని గిరిజనులు పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల రైవాడ జలాశయంతోపాటు చుట్టు పక్కల ఉన్న తామరబ్బ పంచాయతీలో ఏడు, చింతలపూడి పంచాయతీలో ఆరు గిరిజన గ్రామాలకు ప్రమాదం ఉందని నెల రోజుల క్రితం తాము చెప్పినప్పటికీ పనులు ఎందుకు కొనసాగిస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయిల్ టెస్టింగ్ కోసం తీసుకువచ్చిన యంత్రాలను ఇక్కడ నుంచి వెంటనే తీసుకెళ్లకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అంతేకాక మట్టి పరీక్షల కోసం తీసుకువచ్చిన యంత్రాల విడిభాగాలను ఊడదీసి, సమీపంలోని రైతుల కల్లాల వద్ద వుంచారు. పనులు ఆపకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అయిన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు జోక్యం చేసుకుని, ఈ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలోసీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, గిరిజనులు జగన్నాథం, గంగులు, దాయిరి శ్రీను, గమ్మెల లక్ష్మణ, వీరన్నదొర పాల్గొన్నారు.



బల్లిపురం వద్ద హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి మట్టి పరీక్షల పనుల కోసం వినియోగిస్తున్న యంత్ర పరికరాలను ఊడదీస్తున్న గిరిజనులు

వృద్ధురాలిపై హత్యాయత్నం

ఎనిమిది తులాల బంగారు వస్తువులు అపహరణ

- కేబుల్ టీవీ మెకానిక్‌గా గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణమ్మ

అనకాపల్లి టౌన్, జనవరి 28:

ఇంట్లో ఒంటరిగా నివాసం వుంటున్న వృద్ధురాలిపై కేబుల్ టీవీ మెకానిక్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆమె మెడలో వున్న ఎనిమిది తులాల బంగారు వస్తువులను అపహరించుకు పోయాడు. పట్టణంలోని గవరపాలెంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి సీఐ జి.శంకరరావు ఆదివారం మీడియాకు తెలిపిన వివరాలిలా వున్నాయి.

గవరపాలెం పార్కు వీధిలో కర్రి లక్ష్మీనారాయణమ్మ అనే వృద్ధురాలు నివాసం వుంటున్నది. ఈమె కుమారుడు కిశోర్‌కుమార్ రైల్వే శాఖలో హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు. కుమార్తె నాగ చంద్రిక, భర్త మురళీ రింగు రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కేబుల్ టీవీ ప్రసారాలు సరిగా రావడం లేదని లక్ష్మీనారాయణమ్మ శుక్రవారం సాయంత్రం మెకానిక్ గోవింద్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. అదే రోజు రాత్రి ఏడున్నర గంటల సమయంలో గోవింద్ వచ్చాడు. కేబుల్ టీవీ వైర్లు పరిశీస్తుండగా, లక్ష్మీనారాయణమ్మ వేరే పనిలో నిమగ్నమై వుంది. ఈమె మెడలో వున్న బంగారం వస్తువులపై కన్నేసిన గోవింద్, తువ్వాలును ఆమె మెడకు చుట్టి గట్టిగా బిగించడంతో స్పృహ తప్పింది. వెంటనే ఆమె మెడలోని ఎనిమిది తులాల బంగారం వస్తువులు తీసుకుని గోవిద్ పరారయ్యాడు. కొద్దిసేపటి తరువాత నాగ చంద్రిక తన భర్త మురళీతో కలిసి తల్లి వద్దకు వచ్చింది. అపస్మారక స్థితిలో వున్న లక్ష్మీనారాయణమ్మను చూసి తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే చికిత్స నిమిత్తం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న కిశోర్‌కుమార్‌కు తెలియపరచగా ఆయన శనివారం వచ్చారు. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నెట్‌వర్కును తన మొబైల్‌కు అనుసంధానం చేసుకున్న ఆయన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కేబుల్ టీవీ మెకానిక్ గోవింద్ తన తల్లిపై హత్యాయత్నానికి పాల్పడినట్టు గుర్తించి ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శంకరరావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, జనవరి 28: స్థానిక రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫారం చివర గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది రాజు ఆదివారం తెలిపారు. గుర్తు తెలియని రైలు శనివారం అర్ధరాత్రి గాని, ఆదివారం వేకువజామున గాని ఢీకొని ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, కృష్ణుడు కలర్‌పై గీతలు ఉన్న టీషర్ట్ ధరించి గెడ్డంతో ఉన్నాడని తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తించిన వారు దువ్వాడ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వాలని ఆయన కోరారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలోని రామ్‌నగర్ సమీపంలో ఆదివారం గడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ట్రాలీ దగ్ధమైనట్టు అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామని, ట్రాక్టర్ ట్రాలీతోపాటు గడ్డి అగ్నికి ఆహుతైనట్టు తెలిపారు. టి.రామారావుకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ కాలిపోవడంతో సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి


మహాలక్ష్మి (ఫైల్)

కశింకోట, జనవరి 28 : మండలంలోని పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కన్నూరు మహాలక్ష్మి (63) మృతిపై అనుమానాస్పద కేసు నమోదు చేశామని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం అనారోగ్యంగా ఉండడంతో ఇంటివద్దకు వచ్చి వైద్యులు సేవలందించారన్నారు. ఆదివారం ఉదయం మహాలక్ష్మి ఇంట్లో మృతి చెందిందని మృతురాలు చెల్లెలు కుమారుడు సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు చేశామని ఆయన తెలిపారు.

31 కిలోల గంజాయి పట్టివేత

సింహాచలం, జనవరి 28 : అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు తరలిస్తున్న 31 కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు అడి వివరం కూడలిలో ఆదివారం పట్టుకున్నారు. గోపాలపట్నం ఎస్‌ఐ వి.అప్పలనాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. అరకు సమీపంలోని ముంచంగిపుట్టు నుం చి అదే ప్రాంతానికి చెందిన కొచ్చే గోపాల్ (30) బొలెరో వాహనంలో గంజాయి ని సీట్ల కింద పెట్టి కొత్తవలస, పెందుర్తి, అడివివరం మీదుగా విశాఖ రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాడు.ఎన్నికల నిమిత్తం అడివివరం కూడలిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టగా గంజాయి లభించింది. ఈమేరకు గోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడంతో పాటు గంజాయిని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అమలాపురం రోడ్డుపై విరిగిన కల్వర్టు

▸▸ రాకపోకలకు ఇబ్బంది పడుతున్న జనం


అమలాపురం రోడ్డులో విరిగిన కల్వర్టు

నక్కపల్లి, జనవర 28: మండలంలోని అమలాపురం ప్రధాన రహదారిపై రెండు నెలల క్రితం రహదారి కల్వర్టు విరిగిపోవడంతో పలు గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షానికి కల్వర్టు కూలిపోవడంతో అమలాపురం నుంచి వేంపాడు పరిసర గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గత నెలలో సర్పంచ్ పెదపూడి శంకరరావు ఆధ్వర్యంలో కల్వర్టు విరిగిపోయిన చోట పక్కనే తాత్కాలికంగా గ్రావెల్ ఏర్పాటు చేసి మట్టి రహదారిని నిర్మించారు. కానీ ఇప్పటి వరకూ కల్వర్టు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నాళ్లు తాము ఈ బాధలు భరించాలంటూ సర్పంచ్ శంకరరావు, టీడీపీ నాయకులు గోవిందరావు, అప్పలరాజు, సత్తిబాబు, రాజు,కాసులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కల్వర్టును నిర్మించాలని కోరారు.

విశాఖలో సినీ నటి లావణ్య త్రిపాఠి సందడి


బీచ్‌లో చెత్తను సంచిలో వేస్తున్న సినీ నటి లావణ్య త్రిపాఠి

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సినీ నటి లావణ్య త్రిపాఠి ఆర్కే బీచ్‌లో ఆదివారం సందడి చేశారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వైజాగ్ వాలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీచ్ క్లీనింగ్‌లో ఆమె పాల్గొన్నారు. అందమైన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, అనేక సూపర్ హిట్ సినిమాలు ఇక్కడే షూట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ వాలంటీర్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తితత్వం పెంపొందించడంలో కృషి భేష్

▸▸ ప్రముఖ తెలుగు వేద కవి జొన్నవిత్తుల


మాట్లాడుతున్న జొన్నవిత్తుల

విశాఖపట్నం, జనవరి 28: తెలుగు రాష్ట్రాల్లో భక్తి తత్వాన్ని పెంపొందించేందుకు భక్త చైతన్య యాత్ర బృందం చేస్తున్న కృషి గొప్పదని ప్రముఖ తెలుగు వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు కొనియాడారు. పలు దేవా లయాలు సందర్శిస్తూ, వాటి నిర్వహణకు పలు సూచనలందిస్తున్న భక్త చైతన్యయాత్ర బృందం విశాఖ విచ్చేస్తున్నసందర్భంగా ఆదివారం ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన అభినందన సభకు ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, జొన్నవిత్తుల హాజరయ్యారు.ఈ సందర్భంగా జొన్నవిత్తుల మాట్లాడుతూ వేదం ఆధారంగా పండిత పామరులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకున్నారన్నారు. భారత దేశంలో దేవాలయాలనుంచే జ్ఞాన సముపార్జనవుతుందని తెలిపారు. వృత్తి నైపుణ్యాలను ఆలయాల్లో ప్రదర్శించి ప్రయోజనాలు పొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేవాలయాల ప్రాచుర్యం తెలియని వారు గుడుల్లో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో దేవాలయాలు శిథిలావస్థకు చేరడానికి ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. ప్రస్తుత ఈ దుస్థితికి ఆవేదన చెందిన జై తెలుగు పేరిట రాజకీయ పార్టీ స్థాపించినట్టు జొన్నవిత్తుల తెలిపారు. ప్రజల్లో భాష ఔన్నత్యం, ఆలయాలపై అవగాహన కల్పించడమే ల క్ష్యంగా స్థాపించిన ఈపార్టీ నుంచి ప్రముఖ పండితులు ఎన్నికల్లో పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాష, సంస్కృతి కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, పద్య కవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితుడు పీటీజీవీ రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు!

▸▸ 'మిచౌంగ్' కారణంగా మండలంలో 871 ఎకరాలలో పంట నష్టం
▸▸ జనవరి నాటికి ఆదుకుంటామని నాడు ప్రకటన
▸▸ నేటికీ అన్నదాతలకు అందని డబ్బులు


వర్షానికి నాతవరంలో కొట్టుకుపోయిన వరి పనలను తీస్తున్న రైతులు (ఫైల్)

నాతవరం, జనవరి 28: మిచౌంగ్ తుఫాన్ కారణంగా మండలంలో వరిపంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం ప్రకటించే నష్ట పరిహారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ఈ తుఫాన్ రావడంతో వివిధ గ్రామాల్లో పొలాల్లో కోసి ఉంచిన వరి పనలు వర్షానికి కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల పొలంలో ఉన్న పంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. రైతు భరోసా కేంద్రాలలో పనిచేసే వ్యవసాయ సహాయాధికారులు పొల్లాలోకి వెళ్లి కేవలం వరదలో తడిసిన వరి పనలను, అలాగే వరదలో కొట్టుకుపోయిన పంటలను చూసి నష్టాన్ని అంచనా వేశారు. నేలకొరిగిన వరి పంటకు మాత్రం నష్టాన్ని అంచనా వేయలేదు.

తుఫాన్ కారణంగా మండలంలో 871 ఎకరాలలో మొత్తం 985 మంది రైతులు పంట నష్టపోవడం జరిగిందని గుర్తించారు. ఎకరానికి రూ.6,800 చొప్పున నష్టపరిహారం ఈ ఏడాది జనవరి నాటికి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నాడు అధికారులు ప్రకటించారు. నాటి నుంచి నేటి వరకు నష్టపరిహారం కోసం కళ్లుకాయలు కాసేలా రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోతోంది. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నామని పదేపదే ప్రకటనలు గుప్పించే ప్రభుత్వానికి పంట నష్టపోయిన రైతులను సకాలంలో ఆదుకోవాలన్న ఆలోచన లేకపోవడం ఏమిటని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయా రైతులు కోరుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 28: స్థానిక నూకాంబిక అమ్మవారి బాలాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి ఆలయ అర్చకులు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తూనే ఉన్నారు. గవరపాలెంలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం జరగడంతో బంధువుల ఇంటికి వచ్చిన వారు అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా పాలకవర్గం, అధికారులు తగు చర్యలు చేపట్టారు.

చీకటి పడితే చాలు మందుబాబుల వీరంగం

▸▸ క్రీడా మైదానం, బస్టాండ్ సమీప వీధుల్లో ఆగడాలు
▸▸ రాకపోకలకు భయపడుతున్న మహిళలు


రేగుపాలెం ప్రధాన రోడ్డు పక్కన స్థలంలో తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలో పలు ప్రాంతాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో పట్టణ శివారు ప్రాంతాలు, బస్టాండ్ సమీప వీధులు, ఖాళీ వెంచర్లు, రైల్వేస్టేషన్ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతాల్లో మందుబాబులు తాగి చిందేస్తున్నారు. చీకటి పడితే చాలు ఇక్కడకు చేరుకుని మద్యం తాగిన తర్వాత సీసాలను అక్కడే పగలుగొడుతున్నారు. ఆ ప్రాంతాల్లో సంచరించే ప్రజలకు, స్థానిక రైతుల గాజు పెంకులు కాళ్లకు గుచ్చుకుని గాయాలు పాలవుతున్నారు. ప్రధానంగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని రామాలయం వీధి పాన్‌షాపులు సమీపంలో, రైల్వేస్టేషన్ సమీపంలో స్కూలు రోడ్డు ప్రాంతంలో, పెంజెరువు ప్రాంతాల్లో, ఖాళీ వెంచర్లు, పంటపొలాల్లో మందుబాబుల డెన్‌లుగా మారాయి. బస్టాండ్ సమీపంలోని వీధిలో మందుబాబులు కారణంగా ఈ వీధిలో రాకపోకలు సాగించేందుకు మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ఎలమంచిలి రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో సైతం ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీస్ ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టి మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయకపోతే మళ్లీ ఆందోళన

▸▸ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగశేషు


సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

అనకాపల్లి టౌన్, జనవరి 28: అంగన్‌వాడీల సమస్యలపై ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగేశేషు ప్రకటించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ పోరాట విజయోత్సవ సభ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగశేషు మాట్లాడుతూ 42 రోజులు అలుపెరగని పోరాటం చేసిన అంగన్‌వాడీలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలైలో జీతాలు పెంపునకు, ఇతర సమస్యలపై జీవోలు ఇవ్వడంతో డిమాండ్లు పరిష్కరించుకుని విజయం సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్. శంకరరావు, యూనియన్ ప్రతినిధులు వీవీ రమణమ్మ, జి.కుమారి, ఐద్వా ప్రతినిధులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్సులు లేక ఇక్కట్లు

▸▸ పట్టణానికి రోజూ వేలాది మంది రాకపోకలు
▸▸ వచ్చేవారు మల, మూత్ర విసర్జనకు అవస్థలు
▸▸ ముఖ్యంగా మహిళల పరిస్థితి మరీ దారుణం


ఎలమంచిలి పట్టణానికి వాహనాలపై వస్తున్న ప్రజలు

ఎలమంచిలి, జనవరి 28: పట్టణంలో సులభ్ కాంప్లెక్సులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం, మునిసిపాలిటీ కేంద్రం కావడంతో ఎలమంచిలి పట్టణానికి గ్రామాల నుంచి రోజూ వివిధ పనులు, వ్యాపార లావాదేవీలకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ మూత్ర, మల విసర్జనకు సులభ్ కాంప్లెక్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణనాతీతం. గతంలో కొమ్మాయి గుండం వద్ద సులాభ్ కాంప్లెక్సు ఉండేది. అయితే మూడేళ్ల క్రితం మునిసిపల్ అధికారులు ఈ సులభ్ కాంప్లెక్సును తొలగించారు. అయితే కొత్త నిర్మాణం చేపట్టలేదు. కాకివాని వీధి, ధర్మవరం ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులు స్థానికుల కోసం నిర్మించి చేతులు దులుపుకున్నారు. నిత్యం రిజిస్ట్రేషన్‌ల కోసం, రెవెన్యూ, విద్యా సంస్థలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల పనులపైన, వ్యాపార లావాదేవీల కోసం నిత్యం వేలాది మంది ఎలమంచిలి వస్తుంటారు. కానీ వీరంతా మల, మూత్ర విసర్జనకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి పట్టణంలో ప్రజలకు అందుబాటులో సులభ్ కాంప్లెక్సులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

భారత్-ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్‌కు ఏర్పాట్లు

▸▸ ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి


స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 28: ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య ఫిబ్రవరి రెండో తేదీ నుంచి జరగనున్న అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌కు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి ఆదివారం స్టేడియంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలందించారు. పోలీసుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని, పార్కింగ్ ప్రదేశాల వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మ్యాచ్‌లో రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు (ఐదు రోజులకు పది వేల మంది) ఉచిత ప్రవేశం కల్పిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించాలన్నారు. ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రికెట్ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 14,250 మంది క్రికెటర్లకు (రోజుకు 2,800 చొప్పున) ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఇరుజట్ల ఆటగాళ్లు రాక రేపు

హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు ముగిసిన నేపథ్యంలో రెండో తేదీ నుంచి ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టులో పాల్గొననున్న ఇరుజట్ల ఆటగాళ్లు మంగళవారం (30న) నగరానికి చేరుకోనున్నట్టు గోపీనాథరెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 3.25 గంటలకు విశాఖ చేరుకుంటారని, విమానాశ్రయం నుంచి బస్సుల్లో పోలీసుల భద్రత మధ్య హోటల్‌కు చేరుకుంటారన్నారు.

దొంగ ఓట్లతో గెలవాలని జగన్ చూస్తున్నారు

▸▸ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 28 : జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులకు ఆయన వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటరు జాబితాలను ప్రతీ ఒక్కరూ పరిశీలించాలన్నారు. అందులో ఎవరికైనా ఓట్లు లేకపోతే ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు నామినేషన్లకు పది రోజుల ముందు వరకు ఎలక్షన్ కమిషన్ అవకాశం ఇచ్చినట్టు చెప్పారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు, ఇతర లోపాలు ఉంటే ఫారం 7 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, భావితరాల కోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి తీరాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వలంటీర్లను అడ్డంపెట్టుకొని తప్పుడు పనులు చేయడానికి చూస్తే ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక అధికారులు వలన ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆర్డీవో, కలెక్టర్ లేదా ఎలక్షన్ కమిషన్‌కి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

కొనసాగుతున్న సెర్ప్ ఉద్యోగుల సమ్మె

▸▸ నెహ్రూచౌక్‌లో ధర్నా


ధర్నా చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 28: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగుల సమ్మె రెండో రోజు ఆదివారం కొనసాగింది. సెర్ప్ ఉద్యోగులు నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ధర్నా చేసి నినాదాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న గ్రాట్యూటీ రూ.16 లక్షలు, హెచ్‌ఆర్‌పీ జీవోను సెర్ప్ ఉద్యోగులకు అమలు చేయాలని, సెర్ప్‌లో కారుణ్యనియామకాలు జరిపి మరణించిన కుటుంబాలకు న్యాయం చేయాలని, తదితర డిమాండ్లపై నినాదాలు చేశారు. సెర్ప్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి నానిబాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఉమా ప్రసాద్, సత్యసూర్య ప్రకాష్, భవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారుల దాడులు

▸▸ ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్


సీజ్ చేసిన గ్రావెల్ ట్రాక్టర్లు

ఎస్.రాయవరం, జనవరి 28: మండలంలోని పెద ఉప్పలం గ్రామంలో చేపట్టిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై దాడి చేసి, ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని కొండపై శనివారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్టు అందిన సమాచారంతో తమ సిబ్బంది దాడి చేసి, ఎక్స్‌కవేటర్‌తోపాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలంతా సిద్ధం

▸▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

కొత్తూరు, జనవరి 28: సైకో జగన్‌రెడ్డిని ఓడించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇక మిగిలింది 74రోజులు మాత్రమేనన్నారు. వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జగన్‌రెడ్డి అహంకార పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులంతా సిద్ధమయ్యారని తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, జిల్లా కార్యదర్శి మళ్ల గణేష్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో విజయ సాధన

▸▸ కాగ్ సీనియర్ ఆడిటర్ కేఎన్. రాజు పిలుపు


సదస్సులో మాట్లాడుతున్న కాగ్ ఆడిటర్ కేఎన్. రాజు

అనకాపల్లి టౌన్, జనవరి 28 : నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించ వచ్చని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కేఎన్. రాజు పేర్కొన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో శ్రీధర్ సీసీఈ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రైల్వే ఉద్యోగాలు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయ నిర్వహణ, ఏకాగ్రత శక్తిని మెరుగుపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే పరీక్షల కోసం ప్రిపరేషన్ స్ట్రాటజీ, పరీక్షా సరళి, ప్రాథమిక, సొల్యూషన్ పుస్తకాల ప్రాధాన్యతలను రాజు వివరించారు. శ్రీధర్ సీసీఇ పాకల్టీ కె.సూర్య మాట్లాడుతూ భవిష్యత్తులో శ్రీ గౌరీ గ్రంథాలయంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సులు, ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఆర్‌బీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల పరీక్షలకు పలువురు అభ్యర్థులు హాజరయ్యారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

▸▸ మూడు తులాల బంగారం, నగదు బ్యాగును పోలీసులకు అప్పగింత
▸▸ అభినందించిన ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా


ఆటో డ్రైవర్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నర్సీపట్నం, జనవరి 28 : ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని నిరూపించుకుని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలివి. విశాఖపట్నం నుంచి గండికోట సూర్యాకాంతం అనే వృద్ధురాలు ఈనెల 25న నర్సీపట్నానికి బస్సులో విచ్చేసింది. ఇక్కడ దిగి బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. తిరిగి ఆమె ఆటో దిగినప్పుడు కంగారులో అందులో మూడు తులాలు బంగారు ఆభరణాలు, రూ.600 నగదుతో ఉన్న బ్యాగును మరిచిపోయింది. ఇది గుర్తించిన డ్రైవర్ చందు ఈశ్వరరావు వెంటనే పట్టణ సీఐ గణేశ్‌కు ఆ బ్యాగును అందజేశాడు. దీంతో పోలీసులు ఆ వృద్ధురాలి ఆచూకీ తెలుసుకొని ఆదివారం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సమక్షంలో ఆటో డ్రైవర్ చేతుల మీదుగా ఆమెకు బంగారం, నగదులో ఉన్న బ్యాగును అందజేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని ఏఎస్పీ, సీఐతో పాటు ఎస్‌ఐ సుధాకరరావు, సిబ్బంది అభినందించారు.

ట్రాఫిక్ సీఐగా పైడపునాయుడు బాధ్యతల స్వీకారం


సీఐగా బాధ్యతలు చేపట్టిన పైడపునాయుడు

అనకాపల్లి టౌన్, జనవరి 28 : పట్టణ ట్రాఫిక్ సీఐగా పి. పైడపునాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 1998 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన పైడపునాయుడు 2012లో సీఐగా పదోన్నతి పొంది, జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లా పోలీస్ కంట్రోల్ రూము సీఐగా పనిచేస్తున్న పైడపునాయుడును అనకాపల్లి ట్రాఫిక్‌కు బదిలీ చేయడంతో ఆదివారం పైడపునాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ టి.శ్రీనును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని పైడపునాయుడు చెప్పారు.

బొగ్గు లారీల కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి

పరవాడ, జనవరి 28 : హిందూజా పవర్‌ప్లాంట్‌కు పరవాడ, లంకెలపాలెం మీదుగా వెళుతున్న బొగ్గు లారీల కారణంగా ప్రజలు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బొగ్గు లారీల కాలుష్యంతో పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. లారీలతో రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి బొగ్గులారీల కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుడు బండారు కన్నుమూత


బండారు సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

పరవాడ, జనవరి 28 : మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ (64) (కోటా డీలరు) శనివారం అర్ధరాత్రి కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబసభ్యులు అతన్ని మూడు రోజుల క్రితం విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఈయన మృతదేహాన్ని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు దర్శించి, నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాంబిల్లి సీఐ లక్ష్మణరావు బాధ్యతల స్వీకారం



రాంబిల్లి, జనవరి 28 : కొత్తగా ఏర్పడిన రాంబిల్లి సర్కిల్ సీఐగా ఎస్.లక్ష్మణరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ దీనబంధు బదిలీ కావడంతో శ్రీకాకుళం జిల్లా పొందూరు ఎస్ఐగా పనిచేస్తున్న లక్ష్మణరావు పదోన్నతిపై రాంబిల్లి సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

జోరుగా రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు

ఎలమంచిలి, జనవరి 28 : ఎలమంచిలి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరు పక్కలా విస్తరణ పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. దీంతో ఈ రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ వేగంగా చేస్తున్నారు. అయితే ఈ పనులు జరుగుతున్న చోట వాహనదారులు, ప్రజలను అప్రమత్తం చేసే విధంగా హెచ్చరిక బోర్డులతో పాటు హెచ్చరిక రిబ్బన్‌లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయని పలువురు సూచిస్తున్నారు.

దర్జీ కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి టౌన్, జనవరి 28 : స్థానిక గవరపాలెంలో టైలర్‌గా పనిచేస్తూ తీవ్ర అనారోగ్యానికి గురైన కొరుపోలు గౌరీష్ కుటుంబానికి ఆదివారం న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సత్యనారాయణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గౌరీష్‌కు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అందే మహేష్, టి. పుల్లయ్య, కోనా రమేష్, డి. భాస్కరరావు, జోగా జగన్, అద్దేపల్లి సత్యనారాయణ, వియ్యపు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

కశింకోట, జనవరి 28: మండలంలోని భీమవరం, ఎల్.కొత్తూరు, అడ్డాం గ్రామాల్లో 175 మంది పాడి రైతులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ కాయల సత్యనారాయణ, చేకూరి మహేశ్వరరాజు, తురకలపూడి రాజబాబు, గుమ్మడి నారాయణ, పెనుమత్స సత్యనారాయణరాజు పాల్గొన్నారు.





ముగిసిన గవరపాలెం గౌరమ్మ జాతర

అనకాపల్లి టౌన్, జనవరి 28 : జిల్లాలోని ప్రఖ్యాతిగాంచిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర ప్రశాంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు ఆదివారం పొద్దుపోయిన తర్వాత కూడా కొనసాగుతూనే ఉంది. సంతబయలుకు ఊరేగింపు రావడంతో తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, కుటుంబ సభ్యులు గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. దారి పొడువున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఇదిలా ఉండగా శనివారం రాత్రి జాతరలో 34 స్టేజిలపై ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బుర్రకథలు ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి ఒంటి గంట దాటినా రహదారుల్లో జనాల సందడి తగ్గలేదు. డాన్స్ బేబి డాన్స్‌ల వద్ద ఎక్కువగా జనాలు ఉత్సాహంగా గడిపారు. దీంట్లో భాగంగా ప్రముఖ సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు కూడా జాతరలో ప్రత్యేక ఆకర్షణగా కనబడ్డారు. రింగురోడ్డు జంక్షన్ వద్ద అర్ధరాత్రి ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం


ఆదివారం రాత్రి గౌరమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా చిక్కాల జన్మదిన వేడుకలు

» మంత్రి సమక్షంలో కేక్ కట్ చేసిన రామారావు.. » భారీగా తరలివచ్చిన అభిమానులు, వైసీపీ శ్రేణులు


చిక్కాల రామారావును గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం


చిక్కాల రామారావుకు నాగలిని బహూకరించిన నేతలు

పాయకరావుపేట రూరల్, జనవరి 28 : మండలంలోని పెంటకోటలో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిక్కాల అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేకు కట్ చేయించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ బలమైన నాయకుడు రామారావు అన్నారు. గ్రామాలలో నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడే నాయకుడు రామారావు అన్నారు. ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, కంబాల జోగులు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పాల్గొని రామారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మలసాల భరత్, విశాఖ డిప్యూటీ మేయరు సతీష్, డాక్టర్ బంగారయ్య, వైసీపీ నాయకులు దగ్గుపల్లి సాయిబాబా, తోట సత్యకిరణ్, గెడ్డమూరి శ్రీనివాసరావు, నీలాపు బాలకృష్ణారెడ్డి, తూము రాజబాబు, చేపల దేవుడు, తాతాజీ, సర్పంచులు పన్నీరు పాపారావు, కోటేశ్వరరావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా సత్యవరంలో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకలలో రామారావు పాల్గొని కేకు కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

» ప్రమాదకరంగా దర్శనమిస్తున్న కల్వర్టు

పరవాడ, జనవరి 28 : మండలంలోని పి.బోనంగి-కలపాక రహదారిలోని మరిసవానిపాలెం చెరువు వద్ద రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. చెరువును ఆనుకుని ఉన్న కల్వర్టు వద్ద రహదారి పెద్ద ఎత్తున కోతకు గురైంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు భయంభయంగా వెళుతున్నారు. రాత్రి వేళల్లో కోతకు గురైన ప్రదేశం కనిపించడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టలేదు. కోతకు గురైన ఈ ప్రదేశంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడానికి అవస్థలు పడాల్సి వస్తుంది. ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పి.బోనంగి-కలపాక రహదారిలో కల్వర్టుకు రక్షణ గోడ లేని దృశ్యం

వరి రైతు పాట్లు

... 5వ పేజీ తరువాయి

దూరంలో ఉన్న పాయకరావుపేట రైస్ మిల్లులకు ధాన్యం ఎందుకు పంపుతున్నారో అర్థం కావడంలేదని అంటున్నారు. ధాన్యం విక్రయించిన రెండు వారాల్లో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్న అధికారులు మాటలు అమలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ సమస్యల వల్ల మద్దతు ధరకన్నా తక్కువకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని రైస్‌మిల్లులకే ధాన్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డి.పట్టా రైతులకు మొండిచెయ్యి

... 5వ పేజీ తరువాయి

ఇవ్వలేదు. పైగా పైడివాడఅగ్రహారం గ్రామానికి చెందిన 123 మంది రైతులకు వరద నీరు ప్రవహించే గెడ్డ, శ్మశానం పక్కన ప్లాట్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లంకెలపాలెం రోడ్డు నుంచి తమ ప్లాట్ల వద్దకు 60 అడుగుల రోడ్డు ఏర్పాటు చేస్తామన్న హామీని కూడా అమలు చేయడంలేదని వాపోతున్నారు. శ్మశానానికి వెళ్లేందుకు గతంలో వేసిన 15 అడుగుల సీసీ రోడ్డు మాత్రమే ఉందని వారు చెప్పారు. రిటర్న్ ప్లాట్ల గురించి పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు.

ఈ పనులు చేస్తేనే...

తమ నుంచి తీసుకున్న భూములకు ప్రతిఫలంగా కేటాయించిన స్థలాలు వర్షాకాలంలో ముంపు బారిన పడకుండా పలు చర్యలు చేపట్టాలని పైడివాడఅగ్రహారం గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కోరుతున్నారు. ఎగువన ఉన్న కొండల నుంచి వరద నీరు రాకుండా కొండవాలు ప్రాంతంలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి వరద నీరు సాగునీటి చెరువులకు మళ్లించాలని సూచిస్తున్నారు. తమకు కేటాయించిన ప్లాట్లకు అనుకొని ఉన్న తుమ్మలచెరువు నుంచి మిగులు నీరు బయటకు పోయేందుకు కాంక్రీట్‌తో కాలువ నిర్మించాలని, లంకెలపాలెం రోడ్డు నుంచి 60 అడుగుల రోడ్డు ఏర్పాటు నిర్మించాలని, ప్లాట్లను రోడ్లు, డ్రైనేజీలతో అభివృద్ధి చేసి ఇవ్వాలని కోరుతున్నారు.

కాగా నిర్వాసితులకు గెడ్డలో, శ్మశానానికి సమీపంలో ప్లాట్లు ఇవ్వడంపై తహసీల్దార్ బి.సత్యనారాయణను వివరణ కోరగా.. ఇప్పుడు తానేమీ చేయలేననీ, అప్పుడే నాటి అధికారులను అడిగి ఉండాల్సిందన్నారు. ఈ నెలాఖరు నుంచి ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు.

గెడ్డలో స్థలాలు ఇచ్చారు

గొంతిన రవణమ్మ పైడివాడఅగ్రహారం


గొంతిన రవణమ్మ

సర్వే నంబరు 128లో 1.45 ఎకరాల ప్రభుత్వ భూమిని చాలా కాలం నుంచి సాగు చేసుకుంటున్నాం. జగనన్న ఇళ్ల కాలనీ కోసం రెవెన్యూ అధికారులు మా భూమిని తీసుకున్నారు. అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేసి స్థలాలను పరిహారంగా ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఎల్‌పీ పట్టాలు కూడా ఇచ్చారు. కానీ తీరా చూస్తే వరద నీరు పారే గెడ్డలో స్థలాలు ఇచ్చారు. గ్రామ సభలో చెప్పిన విధంగా నివాస యోగ్యమైన ప్రదేశంలో అభివృద్ధి చేసిన స్థలాలు ఇవ్వాలి. లేకుండా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను అడ్డుకుంటాం.

ట్రాఫిక్ పద్మవ్యూహం!

... 5వ పేజీ తరువాయి

తిరిగి ఇళ్లకు తీసుకెళ్లడానికి బస్సులు వస్తుంటాయి. ఈ సమయాల్లో బస్సులను రోడ్డుపైనే వుంచడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కులుగుతున్నది. ఇదే పరిస్థితి కొత్తూరు జంక్షన్ నుంచి దేవరాపల్లి వెళ్లే రోడ్డులో చినబజారు జంక్షన్ వరకు వుంది. ఈ మూడు రహదారుల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నప్పటికీ పోలీసులు స్పందించడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారులతోపాటు, పంచాయతీ అధికారులు కూడా స్పందించి ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించాలని, రోడ్డుపై వాహనాల పార్కింగ్‌ను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

... 5వ పేజీ తరువాయి

సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్‌ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి : పెద్దిరెడ్డి శ్రీను


తోకలవారివీధిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను

పాయకరావుపేట, జనవరి 28 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి లబ్ధి చేకూరడంతోపాటు రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు పట్టణంలోని తోకలవారివీధి, శెట్టిబలిజవీధి, పాత హరిజనవాడ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తే చేకూరే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపూడి అప్పారావు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఉపాధి సామాజిక బృందాల తనిఖీలు


కొడవటిపూడిలో జరుగుతున్న ఉపాధిహామీ గ్రామసభ

కోటవురట్ల, జనవరి 28: మండలంలో బోడపాలెం, కొడవటిపూడి, చౌడువాడల్లో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందాలు ఆదివారం గ్రామసభలు నిర్వహించాయి. కొడవటిపూడి, చౌడువాడ,బోడపాలెంల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించాయి. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి సోషల్ ఆడిట్ బృందం నివేదిక ఆమోదం పొందారు. డీఆర్‌పీ కార్తీక్, ఎస్ఆర్‌పీ రామారావు, ఏపీవో గంగునాయుడు, సర్పంచ్ సూరిశెట్టి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు మెలమంచిలి ప్రకాష్ పాల్గొన్నారు.

గ్యాస్ మూర్తి కన్నుమూత



అనకాపల్లి టౌన్, జనవరి 28 : పట్టణానికి చెందిన ప్రముఖ వాణిజ్యవేత్త, మాజీ జర్నలిస్ట్ బోగాది రాధాకృష్ణమూర్తి (గ్యాస్ మూర్తి) ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా కన్నుమూశారు. ఈయన పట్టణంలో గ్యాస్ మూర్తిగా సుపరిచితుడు. కృష్ణాజిల్లా నాగాయలంకలో జన్మించిన మూర్తి బిటెక్ విద్యనభ్యసించి వ్యాపార నిమిత్తం 40 ఏళ్ల కిందట అనకాపల్లికి వచ్చి హెచ్‌పీ గ్యాస్ డీలరుగా స్థిరపడ్డారు. ఒక పక్క డీలరుగా వ్యవహరిస్తూ మరో పక్క పత్రికారంగంపై ఉన్న అభిలాషతో 1990లో పాత్రికేయుడుగా పలు పత్రికల్లో పనిచేశారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఈయన మృతి పట్ల మాజీ కౌన్సిలర్ పలకా రాము, ప్రముఖ వ్యాపారవేత్తలు వెంపరాల శర్మ, అప్పికొండ వెంకటరావు సంతాపం తెలియపరిచారు.

కుక్కల స్వైర విహారం

» పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడుతున్న గ్రామస్థులు


పెదబోదిగల్లం జంక్షన్‌లో కుక్కల గుంపు

నక్కపల్లి, జనవరి 28: మండలంలోని అనేక గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. పిల్లలను కాన్వెంట్లు, ప్రాథమిక పాఠశాలలకు పంపేటప్పుడు తల్లిదండ్రుల్లో ఎవరొకరు తోడుగా వెళ్లాల్సివస్తోంది. మండల కేంద్రమైన నక్కపల్లి సహా పెదబోదిగల్లం, కాగిత, ఉపమాక, రాజయ్యపేట, జానకయ్యపేట, అమలాపురం, గుల్లిపాడు, వేంపాడు, గునిపూడి, బంగారమ్మపేట, చందనాడ, జి. జగన్నాథపురం, ఉద్దండపురం గ్రామాల్లో వీధి కుక్కలు గుంపు,గుంపులుగా సంచరిస్తున్నాయి. బైక్‌లపై వెళ్లే వారిపై అరుస్తూ వెంబడిస్తున్నాయి. ఈ సమయంలో అనేక యాక్సిడెంట్లకు వాహన చోదకులు గురవుతున్నారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రికి ప్రతీ రోజూ ఒకరిద్దరు కుక్కకాట్లకు గురైన వారు వస్తున్నారు. అందులో పిల్లలు వుంటున్నారని ఆస్పత్రి వైద్య సిబ్బంది చెబుతున్నారు. గ్రామాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరాహార దీక్షను విజయవంతం చేయండి

» పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌రాజు

ఎస్. రాయవరం, జనవరి 28: స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచుల 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విశాఖ జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న నిరాహార దీక్ష చేయనున్నట్టు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు యేజెర్ల వినోద్‌రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాజీ మంత్రి దాడిని కలిసిన టీడీపీ నేతలు


మాజీ మంత్రి దాడితో టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 28 : స్థానిక రింగురోడ్డులోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు మాజీమంత్రి దాడి వీరభద్రరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వీరితో వీరభద్రరావు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వీరభద్రరావు కూడా కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మార్టూరు, మారేడుపూడి, దిబ్బపాలెం, గోపాలపురం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు దాడిని కలిసిన వారిలో ఉన్నారు.

సంపతిపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ


సంపతిపురంలో కరపత్రాలు అందజేస్తున్న పీలా గోవింద

కొత్తూరు, జనవరి 28 : అనకాపల్లి మండలం సంపతిపురంలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ గురించి వివరించారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ల్యాండ్, శాండ్ మాఫియాలకు జగన్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని ఆరోపించారు. టీడీపీతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే పెంచిన కరెంటు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నంబారు నాగమణి, ఉప సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గణేష్, నాయకులు నంబారు శ్రీను, షేక్ బేబీ, ముప్పిన శ్రీను, నక్కా రాజు, కాండ్రేగుల సతీష్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో నేత్ర శిబిరం


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం రూరల్, జనవరి 28 : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 350 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 223 మందికి అద్దాలను అందజేశారు. అలాగే 58 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరో 35 మందికి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ కంపెనీ ఇండియా ప్రతినిధి దొరస్వామి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణే తమ కంపెనీ లక్ష్యమన్నారు.

సీఐని కలిసిన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రాజు


సీఐ పిన్నింటి రమణను సన్మానిస్తున్న పీవీఎస్ఎన్ రాజు

సబ్బవరం, జనవరి 28 : స్థానిక పోలీస్ స్టేషన్ సీఐగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన సీఐ పిన్నింటి వెంకటరమణను తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ని శాలువాతో సత్కరించారు. సీఐని కలిసిన వారిలో టీడీపీ రూరల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గవర అప్పారావు, మండల కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్‌కి సన్మానం


లైబ్రేరియన్‌ని సత్కరిస్తున్న గొర్రెల రాజబాబు తదితరులు

పాయకరావుపేట, జనవరి 28 : జిల్లా ఉత్తమ లైబ్రేరియన్‌గా ప్రసంసాపత్రాన్ని అందుకున్న స్థానిక గ్రంథాలయ ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావును మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు, తుని, పాయకరావుపేట తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆదివారం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి నాగు, భజంత్రీల శివ, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, నాగం సీతారామయ్య, కాకర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో 'చిక్కాల' బర్త్ డే వేడుకలు


రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట, జనవరి 28 : జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. వైసీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు 'చిక్కాల' బర్త్ డే కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు రొట్టిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైసీపీ నాయకులు జగతా శ్రీనివాస్, ఇసరపు తాతారావు, కొప్పిశెట్టి రామ్మోహన్, పిరాది రాజు, పల్యాల లచ్చబాబు, తుమ్మలపల్లి సతీష్, కొంకిపూడి రామకృష్ణ, జొన్నకూటి సూరిబాబు, నెలపర్తి నాగరాజు పాల్గొన్నారు.

ఎలమంచిలి కాపు జేఏసీ కన్వీనర్‌గా నాగేశ్వరరావు

రాంబిల్లి, జనవరి 28 : ఎలమంచిలి నియోజకవర్గ కాపు జేఏసీ కన్వీనర్‌గా గోకివాడ గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి నాగేశ్వరరావు నియమితులయ్యారు. విశాఖలోని ఆరిలోవలో రాష్ట్ర కాపు జేఏసీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాసనాయుడు, తదితరులు నాగేశ్వరరావుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈయన్ని పలువురు కాపు నేతలు అభినందించారు.

మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడి

- ఎన్నికల దృష్ట్యా అప్రమత్తమైనట్టు ఏఎస్పీ రాణా వెల్లడి
- పోలీస్ చెక్ పోస్టుల ఏర్పాటుకు స్థలాల పరిశీలన


అల్లూరి పార్కు సమీపంలో చెక్ పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఏఎస్పీ

కృష్ణాదేవిపేట, జనవరి 28 : త్వరలో సార్వత్రిక ఎన్నికల జరగనున్న నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రత్యేక పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్టు నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. ఆదివారం సాయంత్రం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద, డౌనూరు, గొలుగొండ తదితర ప్రాంతాల్లో ఈ చెక్ పోస్టుల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రూ.50 వేలకు మించి తీసుకు వెళితే ఆ నగదుకు సంబంధించిన అన్ని ఆధారాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో సదరు నగదును సీజ్ చేస్తామన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ చెకోపోస్టులలో నిరంతరం పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలంతా సహకారం అందించాల్సిందిగా ఆయన కోరారు. గ్రామాల్లో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరిగినా వెంటనే తమకు సమాచారం అందించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు బిల్లకోల హరి, నమ్మి గణేష్, గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం రూరల్ ఎస్ఐలు నారాయణరావు, కృష్ణారావు, సీహెచ్.భీమరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం!

... 5వ పేజీ తరువాయి

తిరిగి ఇళ్లకు తీసుకెళ్లడానికి బస్సులు వస్తుంటాయి. ఈ సమయాల్లో బస్సులను రోడ్డుపైనే వుంచడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కులుగతున్నది. ఇదే పరిస్థితి కొత్తూరు జంక్షన్ నుంచి దేవరాపల్లి వెళ్లే రోడ్డులో చినబజారు జంక్షన్ వరకు వుంది. ఈ మూడు రహదారుల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నప్పటికీ పోలీసులు స్పందించడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారులతోపాటు, పంచాయతీ అధికారులు కూడా స్పందించి ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించాలని, రోడ్డుపై వాహనాల పార్కింగ్‌ను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

... 5వ పేజీ తరువాయి

సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) విధానంలో స్వీకరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై ఎనిమిది మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియజేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం ఎనిమిది మంది అభిప్రాయాలను తెలియజేయనున్నారు. ఏపీఈఆర్‌సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోని వారు కూడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేయాలనుకుంటే సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ ఈఆర్‌సీ అనుమతితో రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వివరించారు.

డి.పట్టా రైతులకు మొండిచెయ్యి

... 5వ పేజీ తరువాయి

ఇవ్వలేదు. పైగా పైడివాడఅగ్రహారం గ్రామానికి చెందిన 123 మంది రైతులకు వరద నీరు ప్రవహించే గెడ్డ, శ్మాశానం పక్కన ప్లాట్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. దీంతో ఆయా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లంకెలపాలెం రోడ్డు నుంచి తమ ప్లాట్ల వద్దకు 60 అడుగులు రోడ్డు ఏర్పాటు చేస్తామన్న హామీని కూడా అమలు చేయడంలేదని వాపోతున్నారు. శ్మశానానికి వెళ్లేందుకు గతంలో వేసిన 15 అడుగుల సీసీ రోడ్డు మాత్రమే ఉందని వారు చెప్పారు. రిటర్న్ ప్లాట్ల గురించి పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు.

ఈ పనులు చేస్తేనే...

తమ నుంచి తీసుకున్న భూములకు ప్రతిఫలంగా కేటాయించిన స్థలాలు వర్షాకాలంలో ముంపు బారిన పడకుండా పలు చర్యలు చేపట్టాలని పైడివాడఅగ్రహారం గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కోరుతున్నారు. ఎగువన ఉన్న కొండల నుంచి వరద నీరు రాకుండా కొండవాలు ప్రాంతంలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేసి వరద నీరు సాగునీటి చెరువులకు మళ్లించాలని సూచిస్తున్నారు. తమకు కేటాయించిన ప్లాట్లకు అనుకొని ఉన్న తుమ్మలచెరువు నుంచి మిగులు నీరు బయటకు పోయేందుకు కాంక్రీట్‌తో కాలువ నిర్మించాలని, లంకెలపాలెం రోడ్డు నుంచి 60 అడుగుల రోడ్డు ఏర్పాటు నిర్మించాలని, ప్లాట్లను రోడ్లు, డ్రైనేజీలతో అభివృద్ధి చేసి ఇవ్వాలని కోరుతున్నారు. కాగా నిర్వాసితులకు గెడ్డలో, శ్మశానానికి సమీపంలో ప్లాట్లు ఇవ్వడంపై తహసీల్దార్ బి.సత్యనారాయణను వివరణ కోరగా.. ఇప్పుడు తానేమీ చేయలేననీ, అప్పుడే నాటి అధికారులను అడిగి ఉండాల్సిందన్నారు. ఈ నెలాఖరు నుంచి ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు.

గెడ్డలో స్థలాలు ఇచ్చారు



సర్వే నంబరు 128లో 1.45 ఎకరాల ప్రభుత్వ భూమిని చాలా కాలం నుంచి సాగు చేసుకుంటున్నాం. జగనన్న ఇళ్ల కాలనీ కోసం రెవెన్యూ అధికారులు మా భూమిని తీసుకున్నారు. అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేసి స్థలాలను పరిహారంగా ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఎల్‌పీ పట్టాలు కూడా ఇచ్చారు. కానీ తీరా చూస్తే వరద నీరు పారే గెడ్డలో స్థలాలు ఇచ్చారు. గ్రామ సభలో చెప్పిన విధంగా నివాస యోగ్యమైన ప్రదేశంలో అభివృద్ధి చేసిన స్థలాలు ఇవ్వాలి. లేకుండా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను అడ్డుకుంటాం.

గొంతిన రవణమ్మ, పైడివాడఅగ్రహారం




మాడుగుల : జమ్మాదేవిపేటలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు


చీడికాడలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్


కె.కోటపాడు: కూండ్రవానిపాలెంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

జగన్ పాలనపై జనం విసుగు

- రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు అంతా సిద్ధం
- అప్పులు, రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రకు అగ్రస్థానం
- పార్టీ శ్రేణుల సమావేశాల్లో తాతయ్యబాబు, పీవీజీ కుమార్

బుచ్చెయ్యపేట, జనవరి 28 : ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పులు, రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే గొప్ప స్థానంలో నిలిపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై రూ.2,45,554ల అప్పు ఉందన్నారు. జాతీయ స్థాయిలో ప్రతి రైతు కుటుంబంపై ఉన్న రుణం కంటే ఏపీ రైతులను మూడు రెట్ల భారంలో ముంచారని విమర్శించారు. రైతు భరోసా, సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా కలిపి నాలుగు వేల కోట్లు బకాయి అక్టోబరు నెలలో చెల్లిస్తామని జగన్ చేసిన ప్రకటన కాగితాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాలను తీవ్రంగా అన్యాయం చేసిన జగన్‌రెడ్డి ప్రజా విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. భీమిలిలో శనివారం జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ అన్నీ అబద్ధాలే మాట్లాడారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 730 హామీల్లో పదిహేను శాతం మాత్రమే అమలు చేశారన్నారు. ఓటమి భయం పట్టుకున్న జగన్ తనకు మరో ఛాన్సు ఇవ్వాలని వేడుకుంటున్నా.. ప్రజలు మాత్రం నో ఛాన్సు అంటున్నారని బత్తుల ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

మాడుగుల రూరల్ : రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కోల్పోయిందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని జమ్మాదేవిపేటలో ఆదివారం జరిగిన క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిల ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. టీడీపీ శ్రేణులంతా బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, యూనిట్ ఇన్‌చార్జిలు మజ్జి బాబ్జి, సింహాచలం నాయుడు, సూర్యనారాయణ, నందారపు సన్యాసిరావు, వడ్డి రాజ్‌కుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : జగన్‌రెడ్డి పాలనకు స్వస్తిపలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. చీడికాడలో పార్టీ మండల నాయకులతో కలిసి ఆదివారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పులమయంగా మారిందని దుయ్యబట్టారు. సమర్థుడైన చంద్రబాబునాయుడు పాలన కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, నాయకులు జూరెడ్డి రాము, పేరపు కొండబాబు, సింగంపల్లి అప్పారావు, కన్నూరు వెంకటరమణ, కురచా నారాయణమూర్తి, సింగంపల్లి శ్రీనివాసరావు, డోకల అప్పలనాయుడు, పేరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కెకోటపాడు : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి ఎవరు పోటీ చేసినా అభ్యర్థి విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని ఆ పార్టీ కె.కోటపాడు క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నూరు సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కింతాడ శివారు కూండ్రవానిపాలెంలో ఆదివారం క్లస్టర్ ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనపై ప్రజలంతా విరక్తి చెందారన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు వంటి సమర్థుడు కోసం అంతా ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తథ్యమని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు రొంగలి మహేష్, కశిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణం

- టీడీపీ కౌన్సిలర్ మధు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఫలితం లేకపోవడంతో హై కోర్టులో పిటిషన్ దాఖలు

నర్సీపట్నం, జనవరి 28 : నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నారంటూ హై కోర్టులో పిటిషన్ వేసినట్టు టీడీపీకి చెందిన వార్డు కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు నర్సీపట్నంలోని ధనిమిరెడ్డి వీధిలో వైసీపీ నాయకుడికి చెందిన షాపు అద్దెకు తీసుకొని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నాలుగేళ్లుగా నడుపుతున్నారు. మద్యం దుకాణాలు విద్యా సంస్థలకు వందమీటర్లు లోపు ఉండకూడదనే నిబంధన ఉంది. ఇందుకు విరుద్ధంగా ఎస్టీబాలికల వసతి గృహం, మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్ దగ్గరలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉందని వార్డు కౌన్సిలర్ మధు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడంతో ఎక్సైజ్ అధికారులు విచారణ జరిపి త్వరలో దుకాణం తీసేస్తామని తెలిపారు. కానీ ఇప్పటికీ సదరు షాపు అక్కడే ఉండడంతో హై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు మధు వివరించారు.


నర్సీపట్నంలోని ధనిమిరెడ్డివీధిలో గల ప్రభుత్వ మద్యం దుకాణం

లేని మద్యం షాపు కోసం సంతకాల సేకరణ

ఎక్సైజ్ అధికారులు ఇటీవల రాత్రి వేళలో అయ్యన్నపాలెం వెళ్లి తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దు అని ప్రజలతో సంతకాలు తీసుకోవడానికి ప్రయత్నించడం వివాదాస్పదమైంది. అయ్యన్నపాలెంలో అసలు మద్యం దుకాణమే లేకుండా వద్దని ఎలా సంతకాలు తీసుకుంటున్నారని ప్రజలు ఎదురు తిరిగారు. అక్కడ మద్యం షాపు పెట్టకుండా, మద్యం షాపు వద్దని ప్రజలతో సంతకాలు తీసుకోవడానికి ప్రయత్నించిన ఎక్సైజ్ అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధనిమిరెడ్డివీధిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని అయ్యన్నపాలెంలో మరో దుకాణంలోకి తరలించినట్టు ఎక్సైజ్ అధికారులు లీజ్ అగ్రిమెంట్ సృష్టించి ఉంటారని కౌన్సిలర్ మధు ఆరోపిస్తున్నారు. హైకోర్టును ఆశ్రయించడంతో ఈ వివాదం తమ మెడకు చుట్టుకోకుండా ఎక్సైజ్ అధికారులు అయ్యన్నపాలెం వెళ్లి కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. అయ్యన్నపాలెంలో ప్రభుత్వ మద్యం దుకాణం పెట్టకుండానే, అక్కడ ప్రజల నుంచి మద్యం షాపు వద్దని సంతకాలు తీసుకోవడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. అయ్యన్నపాలెంలో మద్యం షాపును ప్రజలు వద్దని అంటున్నారని, ఈ కారణంగా ధనిమిరెడ్డివీధిలో వైసీపీ నాయకుడి భవనంలో మద్యం దుకాణం తాత్కాలికంగా నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ అధికారులు రికార్డుల్లో చూపించుకోవడానికి ఈ విధమైన డ్రామాకు తెరతీశారని విమర్శిస్తున్నారు.

భవనం అగ్రిమెంటు గడువు ముగిసినా...

ప్రైవేటు భవనంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడుపుతున్నందున నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం లీజ్ అగ్రిమెంట్ రెన్యువల్ చేసుకోవాలి. వైసీపీ నాయకుడికి చెందిన షాపునకు గత ఏడాది సెప్టెంబరుతోనే లీజు అగ్రిమెంట్ ముగిసింది. ఎక్సైజ్ అధికారులు నాలుగు నెలలుగా అదే భవనంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడుపుతుండడం వివాదాస్పదమైంది.

గొలుగొండ ఎస్‌గా కృష్ణారావు బాధ్యతలు



గొలుగొండ : గొలుగొండ ఎస్ఐగా బి.కృష్ణారావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో ఉన్న నారాయణరావు బదిలీపై వెళ్లగా, వీఆర్‌లో ఉన్న కృష్ణారావును ఇక్కడ నియమించారు.

కె.కోటపాడు ఎస్ఐగా లక్ష్మీనారాయణ



కె.కోటపాడు, జనవరి 28 : కె.కోటపాడు ఎస్ఐగా లక్ష్మీనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ధనుంజయ్ సబ్బవరం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా అక్కడినుంచి లక్ష్మీనారాయణ ఇక్కడకు రావడంతో సిబ్బంది స్వాగతం పలికారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

గొలుగొండ, జనవరి 28 : కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండలంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కొత్తఎల్లవరం పంచాయతీ శివారు రాజుపేటలో ఆ పార్టీ జిల్లా నాయకుడు కన్నూరి సత్యనారాయణ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లు వేసి పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల మీదుగా ర్యాలీ సాగించారు.

భక్తులతో సందడిగా మోదకొండమ్మ ఆలయం


ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుతున్న భక్తులు



మాడుగుల, జనవరి 28 : పట్టణంలోని మోదకొండమ్మ ఆలయం ఆదివారం సందడిగా మారింది. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు మహిళలు ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ఆల యల పరిసరాల్లో వంటలు వండుకున్నారు. కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి, జనవరి 28 : అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో మార్చి మూడో తేదీన కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యా లనాయుడు ఆదివారం తారువ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు, బాబూరావు, అర్జున్ పాల్గొన్నారు.

'పెద్దేరు' కాలువల ఆధునికీకరణ చేపట్టాలి

రావికమతం, జనవరి 28 : పెద్దేరు జలాశయం కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టనందుకు నిరసనగా వచ్చే నెల 16వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రావికమతంలో తలపెట్టిన బంద్‌ను అంతా విజయవంతం చేయాలని సంఘం నాయకుడు కె.గోవిందరావు కోరారు. కవ్వగుంట, బుడ్డిబంద గ్రామాలలో గిరి రైతులతో ఆదివారం సమావేశాలు నిర్వహించారు. పెద్దేరు ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.84.4 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఏడాది గడిచినా పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. దీనివల్ల ఆయకట్టు పరిధిలోని భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ పాలకుల్లో స్పందన కరువైందని వాపోయారు. ఇందుకు నిరసనగా కుడి, ఎడమ కాలువల కింద ఉన్న సాగుభూముల రైతులతో కలిసి రావికమతంలో బంద్ పాటించనున్నట్టు ఆయన చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిన ఫ్రిజ్

రావికమతం, జనవరి 28 : మండలంలోని కొత్తకోటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. గ్రామానికి చెందిన మారోజు నానాజీ ఇంట్లో అంతా నిద్రిస్తున్న వేళ శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల టీవీ, ఫ్రిజ్‌తో పాటు ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకూ నష్టం జరిగినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రమదానంతో కేబీ రోడ్డులో గుంతల పూడ్చివేత


దిబ్బిడి వంతెన వద్ద గొయ్యిని పూడ్చుతున్న నాయకులు

బుచ్చెయ్యపేట, జనవరి 28 : కశింకోట- బంగారుమెట్ట (కేబీ) రోడ్డులోని దిబ్బిడి వంతెన వద్ద ఏర్పడిన గుంతలను ఆదివారం టీడీపీ, జనసేన కార్యకర్తలు శ్రమదానంతో పూడ్చారు. వారం రోజుల క్రితం ఈ వంతెన వద్ద పడిన గోతుల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పూడ్చాలని అధికారులను వేడుకుంటున్నా స్పందించక పోవడంతో టీడీపీ, జనసేన నాయకులే గ్రావెల్‌ను తీసుకొచ్చి శ్రమదానంలో గోతును పూడ్చిపెట్టారు. ఇరు పార్టీల శ్రేణులు డీఎస్ నాయుడు, తంపాల రమేష్, పెదరెడ్ల పైడిబాబు, శ్రీను, గొన్నా సూరిబాబు పాల్గొన్నారు.

'నిర్వాసితులకు స్థలాల ఇవ్వాలి'

మాకవరపాలెం, జనవరి 28 : మండలంలో పయనియర్ కంపెనీ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు రెండు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని రాచపల్లిలో గల కామేశ్వరమ్మ గుడి వద్ద ఆదివారం నిర్వాసితులతో సమాశమై సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శేనాపతి శేషు, పూడి చక్రవర్తి, పంచాడ హరినాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేనలను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపుతాం'

రోలుగుంట, జనవరి 28 : ఐదేళ్లుగా చోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. రోలుగుంటలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ మండల వీరమహిళల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులమయంగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు ఆశీర్వదిస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామన్నారు. అనంతరం మండల వీర మహిళా అధ్యక్షురాలు అనిమిరెడ్డి మహేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఇటంశెట్టి రామాదేవి తదితరులను సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, గాలి బాలరాజు, అరిపి త్రినాథ్, సోమిరెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


పార్టీ గుర్తు చూపుతూ మాట్లాడుతున్న రాజు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నాతవరం, జనవరి 28 : మండల కేంద్రం నాతవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఓ సంస్థకు చెందిన ప్రతినిధులు ఆదివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. సంస్థ ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ తమ స్నేహితులంతా సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను సమకూర్చి వసతి గృహాలలో చదివే పేద విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వసతి గృహం సంక్షేమాధికారి రొంగల శివ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతు పాట్లు

... 5వ పేజీ తరువాయి

దూరంలో ఉన్న పాయకరావుపేట రైస్ మిల్లులకు ధాన్యం ఎందుకు పంపుతున్నారో అర్థం కావడంలేదని అంటున్నారు. అంతేకాకుండా ధాన్యం విక్రయించిన రెండు వారాల్లో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్న అధికారులు మాటలు కూడా అమలు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యల వల్ల మద్దతు ధరకన్నా తక్కువకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నామని పలువురు రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాతవరం మండలంలో ఉన్న రైస్ మిల్లులకే ధాన్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాల కోరుతున్నారు.

ఐదొందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బుచ్చెయ్యపేట, జనవరి 28 : నీలకంఠాపురంలోని ఓ పొలంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఐదు వందల లీటర్ల బెల్లం ఊటను ఆదివారం బుచ్చెయ్యపేట పోలీసులు ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

నాతవరం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి

నాతవరం, జనవరి 28 : ఇక్కడి జడ్పీ హైస్కూల్‌లో 1984-85 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాండవ రిజర్వాయర్ వద్ద కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడినవారంతా ఒక్కచోట కలవడంతో వారి ఆనందానికి అవధులు లేదు. తొలుత ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకుని, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. డ్యామ్ వద్ద గల ప్రకృతి అందాల నడుమ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు మానేపల్లి శ్రీనివాసరావు, రెడ్డి వరహాలబాబు, యర్రా కాశీ, చిటికెల వరహాలబాబు, ఎల్.విక్రమ్, వంటాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు


తాండవ రిజర్వాయర్ వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు